క్లుప్తంగా

దరఖాస్తుకు గడువు పొడిగింపు

నర్సాపూర్: మండలంలోని జక్కపల్లి ప్రభుత్వ మోడల్ పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హానా తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో వంద సీట్లు, 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 10 వరకు పెంచారని ఆమె చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

వైభవంగా కొప్పోల్ రథోత్సవం



కొప్పోల్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. రథానికి, ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు.

గొల్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆస్పత్రి సిబ్బంది గ్రామంలోని 162 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందించారు. 16 మందికి వివిధ సమస్యలపై ఉచిత ఆపరేషన్‌ల కోసం తరలించనున్నట్లు ఆస్పత్రి వైద్యులు అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, వైద్యులు సుప్రజ, సురక్ష, అంకిత, లయన్స్ ప్రతినిధులు నాగరాజు, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరిన రిలే దీక్షలు



నిరాహారదీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

నర్సాపూర్: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో డంప్‌యార్డును ఎత్తివేయాలన్న డిమాండ్‌తో నర్సాపూర్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 11వ రోజుకు చేరాయి. దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డంప్‌యార్డు ఎత్తి వేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. దీక్షకు బీజేపీ రాష్ట్ర కార్యావర్గ సభ్యుడు మురళీయాదవ్, బీఆర్ఎస్ నాయకుడు గోపిలు సంఘీభావం తెలిపారు. డంప్‌యార్డు ఎత్తి వేయాలని వారు డిమాండ్ చేశారు. కాగా దీక్షల్లో జేఏసీ నాయకులు రాజేందర్, సురేశ్, భిక్షపతి, శ్రీనివాస్‌గుప్తా, రమణరావు, యాదగిరి, ఆంజనేయులుగౌడ్, కుమార్, ధన్‌సింగ్ పాల్గొన్నారు.

ఆలయాల వద్ద అన్నదానం



వెల్మకన్నలోని బాల వీరహనుమాన్ ఆలయం వద్ద అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీ బాల వీరహనుమాన్ ఆలయం, కంచన్‌పల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు మెట్టు రాములుశర్మ ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం చేసి చందనం అలంకరణచేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదనాం చేశారు.

పంచాయతీ కార్మికుల వేతన వెతలు



భుజిరంపేటలో చెత్తసేకరణ పనులు చేస్తున్న కార్మికులు



కుషన్‌గడ్డతండాలో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న కార్మికులు

- 12 పంచాయతీల్లో 37 మందికి 8 నెలలుగా అందని వేతనాలు
- అవస్థలు పడుతున్న కార్మికులు
- టెక్నికల్ సమస్య అంటున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఎనిమిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో పంచాయతీ కార్మికులు పస్తులు ఉంటున్నారు. అయినా సరే అధికారులు మాత్రం వారితో పనులు చేయిస్తున్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన 37 మంది కార్మికులు అప్పుల పాలై అవస్థలు పడుతున్నారు. కౌడిపల్లి మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు జూలై నెల నుంచి డిసెంబర్ వరకు వేతనాలు రాలేదు. కానీ డిసెంబర్ చివరికి జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోని కార్మికులకు వేతనాలు వచ్చాయి. అయితే కౌడిపల్లి మండలంలోని భుజిరంపేట, కుషన్‌గడ్డతండా, పీర్యతండా, పీర్లతండా, ముత్రాజ్‌పల్లి, తిమ్మాపూర్, నాగ్సాన్‌పల్లి, కూకుట్లపల్లి, మర్రిచెట్టుతండా, సలాబత్‌పూర్, కొత్తచెరువుతండా, శేరితండా పంచాయతీల్లో పనులు చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు మాత్రం రాలేదు. ఆయా గ్రామ పంచాయతీల్లో ఇద్దరి నుంచి అయిదుగురు కార్మికులు పనులు చేస్తున్నారు. కార్మికులు ప్రతీరోజు చెత్త శుభ్రం చేయడం, మురికి కాల్వలు శుభ్రం చేయడం, నీటి సరఫరా, ట్యాంకర్ ద్వారా నీళ్లు పెట్టడం తదితర పనులు ఉదయం నుంచి రాత్రి వరకు చేస్తుంటారు. కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ. 9,500 చెల్లిస్తుంది. ఈ 12 గ్రామాలతో పాటు మహమ్మద్‌నగర్‌కు చెందిన కార్మికులు సగం మాత్రమే వేతనాలు రాగా పూర్తిగా రావాల్సి ఉంది. జిల్లాతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్మికులకు ఆరునెలల వేతనాలు ఒక్కసారిగా రాగా ఈ గ్రామాల కార్మికులకు మాత్రం ఎనిమిది నెలలు గడుస్తున్నా.. వేతనాలు అందలేదు.

సమస్య తీర్చాలి

ఈ కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పులు చేస్తూ కాలం గడుపుతూ పస్తులుండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కార్మికులు కోరుతున్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల పొరపాటు !

అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ల పొరపాటు జరిగిందా లేక టెక్నికల్ సమస్య వల్ల పంచాయతీ కార్మికులకు వేతనాలు రాలేవా అనే విషయం తెలియాల్సి ఉంది. కంప్యూటర్ ఆపరేటర్లు సరిగా పనిచేయక పోవడం వల్ల వేతనాలు రాలేదని అధికారులు చెప్తున్నారు. తప్పు ఎక్కడా జరిగిందో తెలియదు కాని కార్మికులు మాత్రం తిప్పలు పడుతున్నారు.

అప్పులు చేసి పనులు చేస్తున్నాం



ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదు. దీంతో గ్రామంలో తెలిసిన వారివద్ద అప్పులు చేసి బ్రతుకుతున్నాం. జీతం డబ్బులు రాకపోయిన పనులు మాత్రం చేయిస్తున్నారు. అధికారులను అడిగితే అగో ఇగో వస్తాయని చెపుతున్నారు. ఇంతమట్టుకు రాలేదు. అప్పుదొరకని రోజు పస్తులు ఉండాల్సి వస్తుంది. త్వరగా జీతాలు చెల్లించి ఆదుకోవాలి.

– దాకె సురేశ్, భుజిరంపేట

ప్రభుత్వం మంజూరు చేయగానే..

కార్మికులు వేతనాలు చేసేటప్పుడు కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ సమస్యతో 12 గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు వేతనాలు రాలేదు. దీంతో మరోసారి కంప్యూటర్ ఆపరేటర్లతో కార్మికుల బ్యాంక్ అకౌంట్ పూర్తిస్థాయిలో చెక్ చేశాం. ప్రభుత్వం మంజూరు చేయగానే వేతనాలు వస్తాయి.

– శ్రీనివాస్, ఎంపీడీఓ కౌడిపల్లి

గెస్ట్ లెక్చరర్లకు అందని వేతనం

మెదక్ కలెక్టరేట్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా మారింది మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ల పరిస్థితి. కళాశాలలో 14 మంది గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వీరికి గతేడాది నవంబర్ నెలకు సంబంధించిన వేతనం సీసీఈ నుంచి కళాశాలకు డిసెంబర్‌లో విడుదల చేశారు. అయితే వేతనాల బిల్లు ఇప్పటివరకు ట్రెజరీ కార్యాలయానికి చేరలేదు. రాష్ట్రంలో 129 డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 1,224 గెస్ట్ అధ్యాపకులకు నవంబర్ వేతనం డిగ్రీ కళాశాలల ఖాతాలో ఎప్పుడో జమ అయ్యాయి. కేవలం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న 14 మంది గెస్ట్ లెక్చరర్ల వేతనాల బిల్లు మాత్రం ఇప్పటివరకు ఖజానా కార్యాలయంలో సమర్పించకపోవడం గమనార్హం. 4 నెలలుగా వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని గెస్ట్ లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్‌ను వివరణ కోరగా.. బిల్లులలో తప్పులు దొర్లాయని, వాటిని సరిచేసి పంపిస్తామని తెలిపారు. రెండు రోజుల్లో గెస్ట్ లెక్చరర్ల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని చెప్పారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



గౌతాపూర్‌లో పతకాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న హెచ్‌ఎం కృష్ణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ పోటీలో గౌతాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించి తమ ప్రతిభ చాటారు. మండల పరిధిలోని గౌతాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దీప్తి, దివ్య నిత్య, లక్ష్మీప్రియ ఈ నెల 23న సంగారెడ్డిలో జరిగిన వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ అండర్–14, విభాగంలో వారు వెండి పతకాలను సాధించారు. శనివారం ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కృష్ణ, కరాటే కోచ్ మురళి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించడంతో పాటు, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కృష్ణ మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక, మానసిక దృఢత్వాన్ని సాధించవచ్చని అన్నారు.

మనోహరాబాద్‌లో సైన్స్ డే వేడుకలు



విద్యార్థుల ప్రదర్శ తిలకిస్తున్న ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ సైన్స్ డే వేడుకల్లో భాగంగా మండల కేంద్రం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 65 రకాల సైన్స్ పరికరాల నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. కాగా ఇట్టి ప్రదర్శనను ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తిలకించారు. విద్యార్థులు చేసిన వాటిలో ఉత్తమ వాటికి బహుమతులు అందజేసినట్లు హెచ్‌ఎం రహేనా సుల్తానా తెలిపారు. అంతకు ముందు సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీదేవి, సుశనిత, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం వాటిల్లితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో శనివారం సివిల్స్ రైట్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఐ ప్రభాకర్, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ హాజరై గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలోని ప్రసిద్ధ ఆలయమైన జైన మందిరంలోకి ప్రవేశానికి అనుమతి నిరాకరిస్తున్నారంటూ వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎస్‌ఐ సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందని, వాటికి భంగం కలిగితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ విషయమై దేవాలయ సమితితో మాట్లాడి గ్రామంలోని ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండేలా చూస్తానని పేర్కొన్నారు.

సామూహిక వ్రతాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల అరణ్యంలో కొలువైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, మాన్యసూక్తపారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ పాల్గొన్నారు.

చేతిరాతపై అవగాహన

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందమైన చేతిరాతతో అదనపు మార్కులు పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. చేతిరాతపై పాటించాల్సిన మెలకువల గురించి వివరించారు. సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యం మరే దానికి లేదనే విషయం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు ఉన్నారు.

డీసీఎం నుంచి టీవీలు చోరీ

రామాయంపేట(మెదక్): పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం తెల్లవారుజామున డీసీఎం నుంచి ఏడు టీవీ సెట్లతో పాటు, ఒక ఏసీ చోరీకి గురైనట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ నాగేశ్వర్‌రావు రాత్రి తన డీసీఎంలో టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను మేడ్చల్ నుంచి నిజామాబాద్ తరలిస్తున్న క్రమంలో చోరీ జరిగింది. డీసీఎం డ్రైవర్ సంగ్రాం తెల్లవారుజామున రామాయంపేటలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద వాహనాన్ని నిలిపి నిద్రించాడు. ఉదయం లేచి చూడగా, వాహనంలో ఉన్న టీవీలతో పాటు ఏసీ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

రామాయంపేట(మెదక్): పట్టణంలో శనివారం చికెన్ సెంటర్ యజమానిపై దాడి సంఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. మహమ్మద్ ఇర్ఫాన్ తన చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న క్రమంలో పట్టణానికి చెందిన ఇబ్రహీం పాత కక్షలతో దాడికి పాల్పడ్డాడని, అడ్డుకోబోయిన మరో వ్యక్తిపై దాడి చేశాడని తెలిపారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

హనుమాన్ దీక్షలు ప్రారంభం

తూప్రాన్: పట్టణ సమీపంలోని పెద్దచెరువు కట్ట వీరాంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయ పూజారి శాలక ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో వందల మంది హనుమాన్ మాలధారణ చేపట్టారు. ఈసందర్భంగా పూజారి మాట్లాడుతూ.. భక్తులు నిష్ఠతో నియమాలు పాటిస్తే సకల సంపదలు కలుగుతాయని చెప్పారు. మాల విరమణ రోజున సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, లక్ష పుష్పార్చన, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

అమరుల త్యాగాలు వృథా కానివ్వం

మాదిగ అమరులకు నివాళి



నర్సాపూర్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నర్సాపూర్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారికి మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించినట్లు మండల శాఖ అధ్యక్షుడు కుమార్ చెప్పారు. పట్టణంలోని పిల్లల పార్కులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నవీన్, ప్రవీణ్, దాస్, ప్రభు, చింటు, శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరి, మండలాధ్యక్షుడు రామస్వామి, నాయకులు రాములు, సాయిబాబా, చిన్ ఎల్లం, పరమేశ్, ప్రభాకర్, బాలేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు వృథా కానివ్వమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యాదగిరి అన్నారు. మండల కేంద్రం మాసాయిపేటలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు, ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి వినోద్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, భిక్షపతి, భాస్కర్, భాను, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడు మురళి, జిల్లా ప్రతినిధి సుధాకర్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి అశోక్, మండల ఉపాధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి గణేశ్, జీడిపల్లి అధ్యక్షుడు నర్సింలు, భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు రంగంపేటలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. రంగంపేటలో మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలతో జోహార్లు అర్పించారు.

పౌల్ట్రీ యజమానులు జాగ్రత్తలు పాటించాలి

మండల పశువైద్య అధికారి ఫర్హీన్ ఫాతిమా



మాట్లాడుతున్న పశువైద్యాధికారి ఫర్హీన్ ఫాతిమా

కౌడిపల్లి(నర్సాపూర్): పౌల్ట్రీ యజమానులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి ఫర్హీన్‌ఫాతిమా అన్నారు. శనివారం మండలంలోని కంచన్‌పల్లి తదితర గ్రామాల్లో పౌల్ట్రీ ఫామ్‌లను పరిశీలించారు. అనంతరం కౌడిపల్లిలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వస్తుందన్న భయంతో చాలా పౌల్ట్రీల్లో కోళ్లు పెంచడం లేదని చెప్పారు. ఎక్కడైన పౌల్ట్రీఫామ్‌ల్లో కోళ్లు ఉంటే యజమానులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫారం చుట్టూ బ్లీచింగ్ వేయాలన్నారు. బయట నుంచి వచ్చిన వ్యక్తులు ఫారంలో లోనికి వెళ్లేటప్పుడు శానిటైజేషన్ చేసుకొని వెళ్లాలన్నారు. కంచన్‌పల్లిలో కోళ్లు ఎలా చనిపోయాయో టెస్ట్ చేయకుండా చెప్పలేమని చెప్పారు. చనిపోయిన కోళ్లను టెస్ట్ కోసం సంగారెడ్డి ల్యాబ్‌కు పంపించామని ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే బర్డ్‌ఫ్లూనా లేక ఇతర వ్యాధితో చనిపోయిందా అన్ని విషయం తెలుస్తుందని చెప్పారు. వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కన్నయ్య

పెద్దశంకరంపేట(మెదక్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ మెంబర్ డాక్టర్ కన్నయ్య అన్నారు. శనివారం సొసైటీ పరిధిలోని జంబికుంట గ్రామంలో రైతులకు పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అనేక రకాల బ్యాంకు రుణాలు, ఇతర వ్యవసాయ ఆధారిత లోన్‌లు అందజేస్తామని, పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలని, త్వరగా లోన్‌లు చెల్లించాలని సూచించారు. రైతులు సంఘటితంగా ఉండి వ్యవసాయం ద్వారా ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిద్ధసంజీవరెడ్డి, డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మానిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, సీఈఓ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు కోసం శిఖం భూమి కబ్జా



గంగారంలో పత్తికుంట శిఖంలో నుంచి వేసిన మట్టిరోడ్డు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పట్టాభూమిలోకి వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేసేందుకు శిఖం భూమి కబ్జాకు గురైన ఘటన మండలంలోని గంగారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గంగారం గ్రామంలో పత్తి కుంటలోని శిఖం భూమి పక్కనే ఉన్న పట్టాభూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తికి విక్రయించాడు. విక్రయ ఒప్పందం ప్రకారం ఎలాంటి రోడ్డు సౌకర్యం లేని పట్టా భూమికి, శిఖం భూమిలో నుంచి అక్రమంగా మట్టిని పోసి రోడ్డును ఏర్పాటు చేశారు. పలువురు గ్రామస్తులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసువచ్చినప్పటికీ, రోడ్డు వేసిన శిఖం భూమిని చూసి వెళ్తున్నారే తప్ప.. ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజను వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, సిబ్బందిని పంపించి, శిఖం భూమిలో నుంచి వేసిన రోడ్డును తొలగిస్తామన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కల్యాణం.. కమనీయం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని సోమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణం ఆలయ అర్చకులు సంగమేశ్వరశర్మ, శివప్రసాద్ శర్మల వేదమంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు స్వామిఅమ్మ వార్లకు ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం స్థానిక వర్థక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజేశ్వర్ దంపతులు, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్‌లు శ్రీమాన్ రెడ్డి, రామకిష్టయ్య, వర్థక సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ మహిళలకు రిటర్న్‌గిఫ్ట్‌లు అందించారు. మండలంలోని రుద్రారం గ్రామ సంగమేశ్వరాలయంలో కూడా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు.